ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిళ్లల్లో ఉపకమిషనర్ నరసింహ అధ్యక్ష జరిగిన ప్రజావాణిలో రెండు టౌన్‌ప్లానింగ్, రెండు ఇంజినీరింగ్, మరొకటి శానిటేషన్ మొత్తం ఐదు ఫిర్యాదులు రాగా, గాజులరామారం సర్కిళ్లల్లో ఉపకమిషనర్ మల్లయ్య అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో మొత్తం 8 ఫిర్యాదులు రాగా ఇంజినీరింగ్ 5, టౌన్‌ప్లానింగ్ ఒకటి శానిటేషన్ రెండు ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చే వారంలోపు ఈ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులకు ఫార్వర్డ్ చేశారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించడంలో విఫలం

నిజాంపేట్: ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో రెవెన్యూ అధికారులు విఫలయ్యారని, కేవలం నోటీసులు అందజేసి చేతులు దులుపుకుంటున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో నిజాంపేట్, సూరారం తదితర ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి వాటి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా మహిళా ప్రముఖ్ అమలేశ్వరి, నిజాంపేట్ కార్పొరేషన్ సెక్రటరీ అరుణ్‌రావు, ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి ముఖేష్, ట్రేడ్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ధ్వంసమైన రోడ్లను పునరుద్ధరించాలి



ప్రజావాణిలో వినతి అందజేస్తున్న గాంధీనగర్‌కు చెందిన లక్ష్మీనాథ్

రంగారెడ్డినగర్: భూగర్భ డ్రైనేజీ లైన్ ఏర్పాటుతో ధ్వంసమైన రోడ్లను పునరుద్ధరించాలని వివేకానంద్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గాంధీనగర్‌లోని రోడ్ నం. 2, 3, 6, 7, 8 , 16లలో కొన్ని నెలల క్రితం డ్రైనేజీ లైన్‌లు వేశారన్నారు. అయితే రోడ్లను తవ్వి పునరుద్ధరించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. అధికారులు స్పందించి వెంటనే నూతన రోడ్లను వేయాలని వినతిలో కోరారు.

జలమండలి ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో సోమవారం జలమండలి సీజీఎం (రెవెన్యూ) అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణిలో పది ఫిర్యాదులు వచ్చాయి. నూతన నల్ల కనెక్షన్ కావాలని ఒకటి, నీటి బిల్లులు అధికంగా వస్తున్నాయని వాటిని పరిశీలించాలని నాలుగు ఫిర్యాదులు, అదేవిధంగా నూతన తాగునీటి పైపులైను ఏర్పాటు చేయాలని ఒక ఫిర్యాదు, అదేవిధంగా నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని మరో ఫిర్యాదు అందగా వాటిని పరిశీలిస్తామని సీజీఎం రెవెన్యూ, కుత్బుల్లాపూర్ జీఎం శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదులను స్వీకరించారు.

ఇదే మొదటి – చివరి ప్రజావాణి..

కరోనా లాక్‌డౌన్ నుంచి ఇప్పటి వరకు వాటర్ వర్క్స్ కార్యాలయంలో ప్రజావాణి జరగలేదు. జీఎం శ్రీధర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమం 'మొదటి – చివరిది'కావడం విశేషం. ఈనెల 30వ తేదీన శ్రీధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు రాజేష్, అప్పలనాయుడు, రెవెన్యూ ఇన్‌చార్జి రామచందర్, సెక్షన్ మేనేజర్లు శివప్రసాద్ రవికుమార్, అనూష, పూజిత, రమ్య, భారతి, రోహిణి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

బోనాల నిధులకు ఆలయ కమిటీలు దరఖాస్తు చేసుకోండి

కుత్బుల్లాపూర్: బోనాల పండుగకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఆలయ కమిటీలు ఈనెల 30వ తేదీలోపు కమిటీ లెటర్ ప్యాడ్, 3 ఆలయ ఫొటోలు,బ్యాంక్ అకౌంట్ కాపీ, కమిటీ సభ్యుల ఆధార్ జిరాక్సలను జత చేసి పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కార్యాలయంలో ఓ ప్రకటనలో పేర్కొంది.

ప్రమాదం జరగక ముందే స్పందించండి



చెట్టుపై ఒరిగిన స్తంభం



సుభాష్‌నగర్: ఇటీవల గాలి దుమారంతో వృక్షాలు, విద్యుత్ స్తంభాలు చాలా చోట్ల నేలకొరిగాయి. ప్రమాదపుటంచులో వీటిని గుర్తించి బాగు చేయడంలో సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నర్సాపూర్ రాష్ట్ర రహదారి ఆనుకొని జీడిమెట్ల డిపో వద్ద ఇటీవల గాలులకు ఓ విద్యుత్ స్తంభం విరిగి కేవలం ఓ చెట్టుపై వాలింది. ఒకవేళ జరగరానిది ఏదైనా జరిగితే ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రమాదకరంగా విరిగి ఉన్న స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

విద్యార్థికి రూ.10వేల పారితోషికం

నిజాంపేట్: ప్రగతినగర్ జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థి అక్షర టెన్త్ పరీక్షల్లో 10/10 ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో సోమవారం శ్రీపట్టాభి రామాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీహెచ్ సుధీర్‌రెడ్డి ఆలయ కమిటీ అందజేసిన రూ.10వేల పారితోషికాన్ని విద్యార్థికి అందజేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ జనరల్ సెక్రెటరీ ధనరాజ్, జాయింట్ సెక్రెటరీ కె. రాములు, కమిటీ సభ్యులు వెంకారెడ్డి, రవీందర్, విద్యార్థి తల్లిదండ్రులు ఉన్నారు.

జాగ్రత్త.. జాగ్రత్త

ముందుంది మ్యాన్‌హోళ్ల గుంత!

- మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు అవసరం
- కుంగినా.. శిథిలమైనా పట్టించుకోని వైనం

మ్యాన్‌హోల్..



వెంకట్రామిరెడ్డినగర్ రోడ్డులో దిగబడిన మ్యాన్‌హోల్



విజయనగర్ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద



మాణిక్యనగర్ ఆర్చ్ సమీపంలో..



గాంధీనగర్ రోడ్ నం.7కు ఎదురుగా ఉన్న గల్లీలో..



హెచ్ఎంటీ కాలనీలో కుంగిన మ్యాన్‌హోల్



న్యూ షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డులో

డేంజర్ బెల్..



షాపూర్‌నగర్ - గాజులరామారం రోడ్డులోని పీహెచ్‌సీ సమీపంలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

రంగారెడ్డినగర్: భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నిర్వహణను అధికారులు గాలికొదిలేస్తున్నారు. దీంతో ప్రధాన రోడ్లలో దిగబడిన, శిథిలమైన మ్యాన్‌హోల్ మూతలతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఆటంకంగా మారుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఎక్కడ మ్యాన్‌హోల్ కుంగి ఉందో గుర్తించే పరిస్థితి లేదు. ద్విచక్ర వాహనదారులు కుంగిన మ్యాన్‌హోళ్లను చూసుకోకుండా వెళ్తున్నప్పుడు కిందపడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆదమరిచి వెళ్తే కింద పడటం ఖాయమని పేర్కొంటున్నారు.

దీంతో కొత్త డ్రైనేజీ లైన్లపై దృష్టి పెడుతున్న సంబంధిత అధికారులు, పాత మ్యాన్‌హోళ్లను విస్మరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని మ్యాన్‌హోళ్ల నిర్వహణకు జలమండలి నుంచి నిధులు విడుదలవుతున్నట్లు ఉన్నతాధికారులు లెక్కలు చూపుతున్నా వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉంటున్నాయి.

◆ జలమండలి కేంద్ర కార్యాలయం నుంచి నిధులు విడుదల చేయడం లేదని అందుకే మ్యాన్‌హోళ్ల మరమ్మతుల చేపట్టడం లేదని స్థానిక అధికారులు పేర్కొనడం గమనార్హం. ప్రతి నిత్యం ఏదో ప్రాంతంలో మ్యాన్‌హోళ్ల మూతలు శిథిలమవుతున్నా వాటిని మార్చడం లేదు. కొన్ని చోట్ల మ్యాన్‌హోళ్లు భూమితోకి దిగబడుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు మ్యాన్‌హోళ్లల్లో ఇరుక్కుని ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయి. కొన్ని చోట్ల వరదనీరు పారేందుకు ఏర్పాటు చేసిన వాటర్ డ్రెయిన్ మ్యాన్‌హోళ్లు కుంగుతున్నా అధికారులకు పట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'ప్రభుత్వ స్థలం కాపాడాలి.. వెంటనే స్పందించాలి'



గాజులరామారం సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చింతల్ కార్పొరేటర్ రషీదా రఫీ, భగత్‌సింగ్‌నగర్ వాసులు

చింతల్: ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి.. అధికారులు వెంటనే స్పందించాలి.. అంటూ నినాదాలతో గాజులరామారం సర్కిల్ కార్యాలయ ఆవరణ సుమారు 2గంటల పాటు దద్దరిల్లింది. చింతల్ కార్పొరేటర్ మహమ్మద్ రషీద మహమ్మద్ రఫీ, భగత్‌సింగ్‌నగర్ పరిరక్షణ కమిటీ నేతలు అల్లాబకాష్, స్థానికులు సోమవారం ధర్నాకు దిగారు. దీంతో సుమారు 2గంటల పాటు ప్రజావాణి కార్యక్రమం నిలిచిపోయింది. భగత్‌సింగ్‌నగర్ సర్వే నం.155లోని 3550 గజాల ప్రభుత్వ స్థలంలోని 1100 గజాలను కబ్జాదారులకు కట్టబెట్టాలను గాజులరామారం డిప్యూటీ కమిషనర్ చూస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీని విలువ రూ.4కోట్ల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారులకు అప్పజెప్పేందుకు టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారుల సైతం సహకరించారన్నారు. నిరసనలో సాంబయ్య,అశోక్, రామకృష్ణ, జాన్సన్, బిస్వల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



3550 గజాలకే ఫెన్సింగ్ వేయాలంటూ వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు



నంబర్ ప్లేట్‌లేని వాహనాన్ని పరిశీలిస్తున్న మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి



ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం సుచిత్ర సర్కిల్, పేట్‌బషీరాబాద్, కొంపల్లి తదితర ప్రాంతాల్లో లా అండ్ ఆర్డర్, అల్వాల్ పోలీసుల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబరు ప్లేట్లు లేని 22 వాహనదారుల నుంచి రూ.15వేలను ఫైన్ల రూపంలో వసూలు చేశారు. అనంతరం ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌రెడ్డి, ఎస్సై శ్యామ్‌బాబు, అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

'మేధో సంపత్తి ఫెసిలిటేషన్ సెంటర్' సందర్శన

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలను డానిష్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీస్, మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ ప్రతినిధుల బృందం సోమవారం సందర్శించింది. కళాశాలలో స్థాపించిన మేధో సంపత్తి ఫెసిలిటేషన్ సెంటర్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు కిర్‌స్టెన్ క్లైర్ స్కాట్, టీనా డాల్రెప్ పౌల్సెన్, లూయిస్ బోయిసెన్, కేంద్ర మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్ కుమార్, కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ శ్రేయా రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తాచాటిన అనిరుధ్, ఆర్యన్

నిజాంపేట్: గోవాలో జరిగిన 7వ ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్–2024 పోటీల్లో బాచుపల్లి కౌసాల్యకాలనీ, గుల్‌మోర్ టౌన్‌షిప్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు తమ ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈనెల 22 నుంచి 24 వరకు జరిగిన ఈ పోటీల్లో 70.6కిలోల విభాగంలో ఎం.అనిరుధ్ ఫైటింగ్‌లో గోల్డ్, ప్రదర్శనలో బ్రాంజ్ మెడల్ సాధించారు. జి.ఆర్యన్ 31.5 కిలోల విభాగంలో ప్రదర్శనలో సిల్వర్, ఫైటింగ్‌లో బ్రాంజ్ సాధించారు. తమ విద్యార్థులకు పతకాలు సాధించడం పట్ల కోచ్ హన్మంత్ విద్యార్థులను అభినందించారు. కోచింగ్ క్లాస్‌లకు క్రమ శిక్షణతో హాజరు కావడం వల్లే విజయం సాధించారని ఆయన పేర్కొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సదుపాయాలు కల్పిస్తున్నాం



కమిటీహాల్ శంకుస్థాపన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ 7వ డివిజన్‌లో రూ. 50 లక్షలతో చేపట్టనున్న కమిటీ హాల్ నిర్మాణ పనులకు ఆయన స్థానిక కార్పొరేటర్ ప్రణయ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రాధాన్యతా క్రమంలో అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంజునాథ్, ఎన్టీఆర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ శోభారాణి, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ అరుణ్, కాంట్రాక్టర్ హరినాథ్‌రెడ్డి, సూపర్‌వైజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్‌కు సేవా పురస్కారం



కుత్బుల్లాపూర్: పేట్ బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ 'సేవా పురస్కారాని'కి ఎంపిక అయ్యారు. మాదాపూర్ ఎస్ఓటీ సీఐగా పనిచేసిన కాలంలో డ్రగ్స్ విక్రయాలు, క్రికెట్ బెట్టింగ్ నిర్వహణ విషయంలో చాకచక్యంగా వ్యవహరించి ముఠా గుట్టు రట్టు చేశారు. ముఖ్యంగా ఐటీ ఆఫీసర్ పేరుతో ఓ ముఠా బంగారం దుకాణంలో ఏకంగా ఒకటిన్నర కిలోల బంగారాన్ని ఎత్తుకెళ్లిన వెళ్లిన విషయం అప్పట్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సంచలనం రేపింది. వారిని అత్యంత తెలివిగా వ్యవహరించి వారు ఆచూకీ కనుగొని పూర్తి రికవరీ చేసే విషయంలో అందరి మెప్పు పొందారు. ఇలా అనేక కేసుల్లో విజయవర్ధన్ కీలకంగా వ్యవహరించడంతో ప్రభుత్వం 'సేవా పురస్కారం'తో గౌరవించనుంది.

విద్యాసంస్థల బంద్‌కు మద్దతు ఇవ్వాలి

ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నగేష్

కుత్బుల్లాపూర్: ప్రైవేట్ విద్యా సంస్థల అక్రమ ఫీజు దోపిడీతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారని ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ రెగోడ్ నగేష్ అన్నారు. ఈనెల 26న ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు నివ్వడంతో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుందామంటే సరైన వసతులు ఉండటం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తే ట్యూషన్ ఫీజు, బుక్స్, డోనేషన్‌లతో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఫీజుల నియంత్రణకు చట్టాన్ని తీసుకురావాలని, కార్పొరేట్ శక్తులకు రాష్ట్ర ప్రభుత్వం కొమ్ము కాసే విధంగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. ఈ నెల 26న జరిగే బంద్‌కు పాఠశాలల యాజామాన్యాలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

సిగ్నళ్ల ఏర్పాటుతో ట్రాఫిక్‌కు చెక్



గాజులరామారం చౌరస్తాలో సిగ్నల్ ఏర్పాటుపై మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

సుభాష్‌నగర్: నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే కూడల్లో వాహనాలు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపడుతున్నామని జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. గాజులరామారం చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసేందుకు సోమవారం సిబ్బంది, స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. వాహనాల రద్దీతో ఉండే గాజులరామారం చౌరస్తాలో ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులతో సంయుక్తంగా రోడ్డుపై వెలిసిన చిల్లర కొట్టులను తొలగించామన్నారు. ట్రాఫిక్ సిగ్నల్‌కు అవసరమయ్యే స్థలాన్ని గుర్తించి ఇటీవల మార్క్ కూడా వేశామన్నారు. ప్రస్తుతం రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు, ఇతర నిర్మాణాలను తొలగించి త్వరలో సిగ్నల్ ఏర్పాటు చేసున్నట్లు పేర్కొన్నారు. ఈ సిగ్నల్ ఏర్పాటుతో ఇక నుంచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా వాహనాలు సులువుగా వెళ్లేందుకు వీలుంటుందన్నారు.


మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

నిజాంపేట్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ నాయకులు సోమవారం కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. సీఐటీయూ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్ రాజ్యం మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఫిక్స్‌డ్ తదితర పద్ధతుల్లో ఎంతో మంది పని చేస్తున్నారని అన్నారు. జీవో నం.4 విడుదల చేసి అందరికీ ఒకే వేతనాన్ని వర్తింపజేస్తూ ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పబ్లిక్, నాన్ పబ్లిక్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అంతే కాకుండా చేసిన తప్పిదాన్ని సరిదిద్దాల్సింది పోయి మరో జీవో విడుదల చేసి ప్రస్తుతం కార్మికులు పొందుతున్న వేతనాన్ని తగ్గిస్తూ ఆదేశించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన పీఆర్‌సీలో పేర్కొన్న విధంగా కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున్న ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు విచ్చేసి స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. కుత్బుల్లాపూర్‌ను సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

జగద్గిరిగుట్ట: స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ కె.జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని సంజయ్‌పూరి కాలనీలో రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, శ్రీనివాస్, కిరణ్, లక్ష్మణరావు, యాదగిరి, మాణిక్ చంద్, రవికుమార్, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్యాచ్‌వర్క్ పనులపై స్థానికుల హర్షం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ భండారి లేఅవుట్, జర్నలిస్ట్ కాలనీల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారిన విషయంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. స్థానికంగా రోడ్లు గుంతలమయంగా ఉండటంతో ఈ విషయమై నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్‌రెడ్డితో కలిసి కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. సోమవారం భండారి లేఅవుట్, జర్నలిస్ట్ కాలనీల్లో రోడ్డు ప్యాచ్‌వర్క్‌లను ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తా



యూనియన్ ఎన్నికల్లో గెలుపొందిన రాముగౌడ్

దుండిగల్: ఆల్కాలిక్ మెటల్స్ కంపెనీ యూనియన్ ఎన్నికల్లో ఎం.రాముగౌడ్ విజయం సాధించారు. దుండిగల్ మున్సిపాలిటీ సారెగూడెంలోని పరిశ్రమ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అభ్యర్థిగా పోటీ చేసిన రాముగౌడ్ ప్యానెల్ బీఆర్ఎస్‌కేవీ అభ్యర్థి మల్లేశ్ ప్యానెల్‌పై గెలుపొందింది. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి సలహాదారులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాముగౌడ్ మాట్లాడుతూ.. తన విజయానికి సహకరించిన నాయకులు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శంకర్, మాజీ సర్పంచ్ యాదగిరి, బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సదానందం, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.